క్లుప్తంగా

విద్యార్థులకు సత్కారం



అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో మెరిట్ విద్యార్థులకు సత్కారం

కాకినాడ రూరల్: పదో తరగతి, ఇంటర్ ఫలితాల్లో ప్రతిభ చాటిన విద్యార్థులను అడబాల ట్రస్ట్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా సత్కరించారు. రమణయ్యపేట ఏపీఐఐసీ కాలనీలో జరిగిన కార్యక్రమంలో మెరిట్ విద్యార్థులు ఎ.హరి కమని, వి.మనోహర్, ఎస్.ప్రియాంకలను అడబాల ట్రస్ట్ చైర్మన్ రత్నప్రసాద్ సత్కరించి నగదు బహుమతి అందించారు. ముఖ్య అతిథిగా హాజరైన డాక్టర్ వెంకటరమణ మాట్లాడుతూ మెరిట్ విద్యార్థులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. డాక్టర్ శిరీష, అడబాల సత్యనారాయణ, రాఘవరావు, రెడ్నం రాజా తదితరులు పాల్గొన్నారు.

రోడ్ల మరమ్మతులు చేపట్టాలి

బోట్‌క్లబ్: కాకినాడ నగరంలో పలు ప్రధాన రహదారులు శిథిలావస్థకు చేరాయని, మరమ్మతులు చేయకుంటే మరింత పాడయ్యే ప్రమాదం ఉందని పౌర సంక్షేమ కన్వీనర్ దూసర్లపూడి రమణరాజు కార్పొరేషన్ అధికారులను కోరారు. ఎన్టీఆర్ బ్రిడ్జిపై ఏర్పడిన గొయ్యిని శుక్రవారం సంక్షేమ సంఘ సభ్యులు పూడ్చారు. అన్నమ్మ ఘాటీ, మెయిన్ రోడ్, వార్ఫ్ రోడ్, టూటౌన్ సాంబమూర్తినగర్, జగన్నాథపురం ఫ్లైఓవర్ బ్రిడ్జిల రోడ్లు శిథిలమై పాడైనందున తారురోడ్లు పునర్నిర్మించాలన్నారు. ఈ బాధ్యతను ఆర్అండ్‌బీ, కార్పొరేషన్ అధికారులు తీసుకోవాలన్నారు.

తాగునీటి సమస్య రాకుండా చూడండి

సామర్లకోట: స్థానిక మున్సిపాలిటీ పరిధిలో ప్రజలకు తాగునీటి సమస్య రాకుండా చూడాలని మున్సిపల్ కమిషనర్ జె.రామారావు బోర్‌వెల్ ఆపరేటర్లను ఆదేశించారు. మున్సిపాలిటీ పరిధిలో ఉన్న రెండు మినరల్ వాటర్ ప్లాంట్లు వినియోగంలోకి తీసుకువచ్చామన్నారు. గోదావరి కాలువలో నీరు లేకపోవడం, ఫిల్టర్ చెరువులో నీరు నాచు పట్టడంతో కుళాయిల ద్వారా ఆకుపచ్చ రంగులో నీరు వస్తుందని తెలిపారు. ఈ సమస్య నివారణకు మున్సిపాలిటీ పరిధిలోని బోర్లను వినియోగంలోకి తీసుకు వచ్చామని చెప్పారు. ఈ మేరకు ప్రజలకు బోరు నీటిపై అవగాహన పెంచాలని సూచించారు. ఫిల్టర్ చెరువులో నీటి కంటే బోరు నీరు శ్రేష్టమని తెలిపారు. ఈ విషయాన్ని ప్రజలకు సచివాలయ కార్యదర్శులు, తాగునీటి ఆపరేటరింగ్ సిబ్బంది తెలియజేయాలన్నారు.


శిక్షణ పొందిన మహిళలకు సర్టిఫికెట్ల పంపిణీ



మహిళలకు సర్టిఫికెట్లు అందిస్తున్న అరబిందో ప్రతినిధులు

కొత్తపల్లి: అరబిందో ఫార్మా ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాకినాడ సెజ్ ప్రాంతంలో మహిళలకు కుట్టు శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలకు శుక్రవారం ఆ సంస్థ ప్రతినిధులు సర్టిఫికెట్లు పంపిణీ చేశారు. ప్రతిభా కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న 25 మంది మహిళలకు అరబిందో ఫార్మా ఫౌండేషన్ జనరల్ మేనేజర్ సుధాకర్, కాకినాడ సెజ్ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ చామకూర వీరన్న సర్టిఫికెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో అరబిందో ఫార్మా ఫౌండేషన్ సభ్యులు పాల్గొన్నారు.

మరిడమ్మకు ప్రత్యేక పూజలు



బంగారు, వెండి పుష్పాలతో పూజలు అందుకున్న అమ్మవారు

పెద్దాపురం: కోరిన కోర్కెలు తీర్చే అమ్మవారిగా పేరొందిన పెద్దాపురం మరిడమ్మకు శుక్రవారం బంగారు, వెండి పుష్పాలతో పూజలు నిర్వహించారు. అనంతరం పంచామృతాభిషేకం, ప్రత్యేక పూజలు జరిగాయి. ఆలయ ట్రస్టీ చింతపల్లి బ్రహ్మాజీ, ఆలయ అసిస్టెంట్ కమిషనర్ సీహెచ్‌వీ రామ్మోహనరావు ఆధ్వర్యంలో చండీ హోమం జరిపారు. అధిక సంఖ్యలో భక్తులు హాజరై వేడుకలను తిలకించారు.

పాదగయ క్షేత్రాన్ని దర్శించిన రక్షా రామయ్య

పిఠాపురం: పిఠాపురం పాదగయ క్షేత్రాన్ని కర్నాటక రాష్ట్రంలోని చిక్‌బల్లాపూర్ లోక్‌సభ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి, యువజన కాంగ్రెస్ జాతీయ ప్రధాన కార్యదర్శి రక్షా రామయ్య శుక్రవారం సతీసమేతంగా దర్శించుకున్నారు. స్థానిక ఎమ్మెల్యే పెండెం దొరబాబుతో కలిసి కుక్కుటేశ్వరస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికా అమ్మవారు దత్తాత్రేయ స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆయనకు ఆలయ అర్చకులు ఆశీర్వచనాలు అందజేశారు.

హృద్యానవనమిది.. అందరిది

- పార్కుల్లో సందడే సందడి
- హాయిగా గడుపుతున్న చిన్నారులు



సందర్శకులతో కిటకిటలాడుతున్న గాంధీనగర్ పార్కు

బోట్‌క్లబ్: వేసవి.. ఆపై సెలవుల కాలం వచ్చిందంటే చాలు.. చిన్నా పెద్దా అనే తేడా లేకుండా ఇంటి నుంచి కాసేపు సాయంత్రం వేళ అలా బయటకు వచ్చి ఆహ్లాదంగా గడపాలనుకుంటారు. ఇక చిన్నారుల సందడి అంతా ఇంతా కాదు. ప్రస్తుతం పిల్లల ఆటపాటలతో పార్కులు, ఖాళీ స్థలాలన్నీ నిండుతుంటాయి. పెద్దల ఆరోగ్యం, యువత, చిన్నారులను దృష్టిలో ఉంచుకుని వైఎస్సార్ సీపీ ప్రభుత్వం నగరంలో పార్కులు, గ్రీన్‌బెల్ట్‌లకు ప్రాధాన్యం ఇచ్చింది. ఇందులో భాగంగానే కాకినాడ నగర పాలక సంస్థలోని పలు వార్డుల్లో ఉన్న పార్కులను అభివృద్ధి చేసింది. కార్పొరేషన్ ఏర్పాటు చేసిన ఓపెన్ జిమ్‌లు ఆరోగ్య పరిరక్షణకు ఎంతగానో దోహదపడుతున్నాయి. పాఠశాలలకు జూన్ 12 వరకూ సెలవులు కావడంతో నగరంలోని బోట్‌క్లబ్, గాంధీనగర్, రాజా ట్యాంకు పార్కుల్లో సందడి నెలకొంది. చిన్నారులు ప్రతి రోజూ సాయంత్రం 4 నుంచి రాత్రి 8 గంటల వరకూ ఆటలాడుతూ ఆనందంలో మునిగిపోతున్నారు. అమ్మమ్మ, తాతయ్యల ఇళ్లకు వచ్చినవారు కూడా ఎంజాయ్ చేస్తున్నారు. స్థానిక బోట్‌క్లబ్ పార్కులో ఉదయం 5 నుంచి 8 గంటల వరకూ, సాయంత్రం 4 నుంచి 8 గంటల వరకూ వాకింగ్, ఓపెన్ జిమ్ చేస్తుంటారు. ప్రస్తుత వేసవికాలంలో పార్కునకు వచ్చేవారి సంఖ్య రెట్టింపయ్యింది. వేసవి కాలం కావడంతో ఇంట్లో వేడిని తట్టుకోలేక పార్కులో చల్లని గాలికోసం అధికంగా వస్తున్నారు. కాకినాడ నగరంలో 50 డివిజన్లు ఉన్నాయి. దాదాపు అన్ని డివిజన్లలో చిన్న, చిన్న పార్కులు ఉన్నాయి. వీటిలో ఆయా ప్రాంతాలకు చెందిన ప్రజలు వేసవి తాపం నుంచి ఉపశమనం కోసం సాయంత్రం వేళ పార్కుల బాట పడుతున్నారు.

కిటకిటలాడుతూ..

గాంధీనగర్ పార్కు, రాజా ట్యాంకు పార్కులో చిన్న పిల్లలు ఆడుకోవడానికి ఉయ్యాల, జారుడు బల్లలతోపాటు షటిల్ ఆడుకోవడానికి కోర్టులు సైతం ఏర్పాటు చేయడంతో ఎక్కువ మంది ఆడుకోవడానికి ఇష్టపడుతున్నారు. స్థానిక భానుగుడి జన్మభూమి పార్కు, రాజా ట్యాంకు పార్కులో స్కేటింగ్ రింగ్ ఉండడంతో స్కేటింగ్ నేర్చుకునేందుకు అధిక సంఖ్యలో చిన్నారులు ఇక్కడకు వస్తున్నారు. సందర్శకులతో పాటు ఆటలు ఆడుకోవడానికి అధిక సంఖ్యలో స్థానికులు రావడంతో పార్కులన్నీ కిటకిటలాడుతున్నాయి.



కాకినాడ సాగరతీరంలో పర్యాటకుల సందడి

సాగర తీరంలో సందడి

సాగర తీరంలో సందర్శకుల సందడి నెలకొంది. సాయంత్రం 5 గంటలు తర్వాత సాగరతీరం సందర్శకులతో కిటకిటలాడుతోంది. సాయంత్రం వేళ చల్లని గాలికోసం, వేసవి వేడి నుంచి ఉపశమనం కోసం ప్రజలు సాగర తీరానికి చేరుకోవడంతో అక్కడ కిటకిటలాడుతోంది. హైదరాబాద్ వంటి ప్రాంతాల నుంచి వచ్చిన వారు ఈ వేసవి సెలవుల్లో ఎక్కువగా సాగరతీరంలో గడిపేందుకు ఇష్టపడుతున్నారు.

ఆడుకోవడానికి బాగుంది



బోట్‌క్లబ్ పార్కులో ఆడుకోవడం చాలా బాగుంది. వేసవి సెలవులు కావడంతో ఆడుకోవడానికి ఎక్కువ సమయం ఉంటుంది. మామూలు రోజుల్లో స్కూల్ ఉండడంతో పార్కుకు వచ్చే సమయం ఉండేదికాదు. ఈ వేసవి సెలవులను చాగా ఎంజాయ్ చేస్తున్నాం. రోజూ సాయంత్రం 6 గంటల నుంచి 8 గంటల వరకూ పార్కులో ఆడుకుంటున్నాం. ప్రతి రోజూ మా చెల్లి శ్రేయతో కలిసి బోట్‌క్లబ్ పార్కులోని ఆట స్థలంలో ఆడుకుంటున్నాం.

– చింతపల్లి శ్రీకర్

ఎంజాయ్ చేస్తున్నాం..



మామూలు రోజులలో స్కూల్ వెళ్లేందుకు, హోమ్ వర్క్ రాసుకునేందుకు సమయం సరిపోతుంది. ప్రస్తుతం సెలవులు కావడంతో స్విమ్మింగ్ నేర్చుకోవడంతో పాటు, రాజా ట్యాంకు, బోట్‌క్లబ్ పార్కులో ఆడుకోవడానికి వెళుతున్నాం. ఈ సెలవుల్లో ఎంతో ఎంజాయ్ చేస్తున్నాం. – జి.దీక్షిత

యోగా శిక్షణతో శారీరక ఆరోగ్యం



సమావేశంలో మాట్లాడుతున్న నగరపాలక సంస్థ కమిషనర్ వెంకటరావు

కాకినాడ: రెడ్‌క్రాస్ యోగా కేంద్రం కాకినాడకు వరమని నగరపాలక సంస్థ కమిషనర్ జె.వెంకటరావు అన్నారు. స్థానిక వివేకానంద పార్కు ఆవరణలో నిర్వహించిన వేసవి యోగా శిక్షణ తరగతుల ముగింపు కార్యక్రమం శుక్రవారం జరిగింది. కమిషనర్ మాట్లాడుతూ వేసవి సెలవుల్లో సెల్‌ఫోన్లు, ఇంటర్‌నెట్ ప్రభావం పిల్లలపై పడకుండా చూసుకోవాల్సిన బాధ్యత తల్లిదండ్రులపై ఉందన్నారు. పిల్లలకు మానసిక ఆధ్యాత్మికత, శారీరక ఆరోగ్యాన్ని అందించే వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ప్రయోజనాన్ని ఇస్తాయన్నారు. రెడ్‌క్రాస్ చైర్మన్ వైడీ రామారావు మాట్లాడుతూ 2017 నుంచి వేసవి శిక్షణ శిబిరాన్ని నిర్వహిస్తూ పిల్లల్లో మానసిక వికాసానికి కృషి చేస్తున్నామన్నారు. ఈ ఏడాది 60 మంది బాలబాలికలకు శిక్షణ ఇచ్చామన్నారు. శిబిరంలో వివిధ అంశాలపై శిక్షణ ఇచ్చిన శిక్షకులను కమిషనర్ సత్కరించి బహుమతులు, సర్టిఫికెట్లు అందజేశారు. రెడ్‌క్రాస్ కార్యదర్శి కె.శివకుమార్, సంస్థ సభ్యులు పద్మజా వాణి, సీహెచ్ సుశీ, సచితానంద బాలయోగి, యోగా శిక్షకులు శ్రీనివాస్, పల్లవి తదితరులు పాల్గొన్నారు.

స్ట్రాంగ్ రూమ్ భద్రత పరిశీలన

కాకినాడ సిటీ: జేఎన్‌టీయూకేలో భద్రపరచిన ఈవీఎం స్ట్రాంగ్ రూముల వద్ద భద్రత, నిఘా వ్యవస్థ, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను జిల్లా ఎన్నికల అధికారి, కలెక్టర్ జె.నివాస్, జిల్లా ఎస్పీ ఎస్.సతీష్ కుమార్ శుక్రవారం పరిశీలించారు. కాకినాడ సిటీ నియోజకవర్గానికి సంబంధించి జేఎన్‌టీయూకే సివిల్ ఇంజినీరింగ్ బ్లాక్ వద్ద ఉన్న ఈవీఎం స్ట్రాంగ్ రూమును, ఓట్ల లెక్కింపు ఏర్పాట్లను పరిశీలించి, అధికారులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు, ఇతర ఎన్నికల అధికారులు పాల్గొన్నారు.

కాకినాడ: కాకినాడ సిటీ నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి జె.వెంకటరావు శుక్రవారం స్థానిక జేఎన్టీయూకే సివిల్ బ్లాక్‌లో ఏర్పాటు చేసిన స్ట్రాంగ్ రూమ్‌లను పరిశీలించారు. ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఏఆర్వో చెల్లన్న దొర ఇతర అధికారులతో కలసి స్ట్రాంగ్ రూమ్ కు వెళ్లిన ఆయన అక్కడి భద్రతా ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవీఎంలకు మూడంచెల భద్రత ఏర్పాటు చేశామన్నారు. నిరంతరం పర్యవేక్షించేలా ఇద్దరు గెజిటెడ్ అధికారులను కూడా నియమించామని ఆర్వో వెంకటరావు తెలిపారు. ఆయన వెంట పలువురు ఎన్నికల సిబ్బంది ఉన్నారు.



స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించిన ఆర్వో వెంకటరావు

భద్రతా ఏర్పాట్లపై ఆరా

కాకినాడ సిటీ: పిఠాపురం నియోజకవర్గ రిటర్నింగ్ అధికారి, జిల్లా జాయింట్ కలెక్టర్ ఎస్.రామ్‌సుందర్‌రెడ్డి శుక్రవారం స్థానిక జేఎన్టీయూలోని డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ సెంట్రల్ లైబ్రరీలో ఏర్పాటు చేసిన ఈవీఎంలు ఇతర ఎన్నికల సామగ్రి భద్రపరిచిన స్ట్రాంగ్ రూమ్‌ను సందర్శించారు. రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు ఎన్నికల అధికారులతో కలసి స్ట్రాంగ్ రూమ్‌కు వెళ్లి అక్కడి భద్రతా ఏర్పాట్లను ఆయన పర్యవేక్షించారు.



స్ట్రాంగ్ రూమ్‌ను పరిశీలిస్తున్న కలెక్టర్ నివాస్

భావనారాయణస్వామి కల్యాణోత్సవాలు ప్రారంభం

కాకినాడ రూరల్: సర్పవరంలో వేంచేసి ఉన్న రాజ్యలక్ష్మీ సమేత భావనారాయణ స్వామివారి వార్షిక కల్యాణోత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఆదివారం స్వామి, రాజ్యలక్ష్మీ అమ్మవారికి కల్యాణం జరుగనుంది. ఇందులో భాగంగా శుక్రవారం ఉదయం 5 గంటలకు భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవార్లకు పంచామృత అభిషేకం నిర్వహించారు. నూతన వస్త్రాలతో పెండ్లి కుమారుడు, పెండ్లి కుమార్తెగా ముస్తాబు చేశారు. అర్చకులు విశేష అర్చన చేశారు. సాయంత్రం ధ్వజరోహణ, దీక్షధారణ నిర్వహించి గరుగ పొంగలి నివేదించారు. సంతానం కావాల్సిన వారు గరుడ పొంగలిని ప్రసాదంగా సంతానం ప్రాప్తిస్తుందని నమ్మకం ఉండడంతో భక్తులు స్వీకరించేందుకు పోటీ పడ్డారు. సాయంత్రం 6.30 గంటలకు తిరువీధి ఉత్సవాన్ని నిర్వహించారు.

నేటి నుంచి వేణుగోపాలస్వామి ఆలయంలో..

బోట్‌క్లబ్: స్థానిక దేవాలయం వీధిలోని రుక్మిణీ సత్యభామా సమేత వేణుగోపాలస్వామి ఆలయంలో శనివారం నుంచి 24 వరకూ వార్షిక కల్యాణ మహోత్సవాలు జరుగుతాయని ఆలయ ఈఓ రాపర్తి రాజేశ్వరరావు ఓ ప్రకటనలో పేర్కొన్నారు. శనివారం స్వామి అమ్మవార్లకు పంచామృతాభిషేకం, అలంకారం, అర్చన, 19న ధ్వజారోహణం, గ్రామోత్సవం, స్వామి కల్యాణోత్సవం, 21న సదస్య మహోత్సవం, 23న పూర్ణాహుతి, చక్రతీర్థం, 24న శ్రీపుష్పయాగం వైభవంగా జరుగుతాయన్నారు.



సర్పవరం భావనారాయణ స్వామి, రాజ్యలక్ష్మి అమ్మవారు

శాంతిభద్రతల పరిరక్షణకు సహకరించాలి

- కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

పిఠాపురం: ఎన్నికల్లో పార్టీల పరంగా ఎవరికి వారు ప్రచారం చేసుకున్నా, ఎన్నికల అనంతరం అందరూ కలిసి ఉండాలి తప్ప ద్వేషాలు పెంచుకుని విధ్వంశాలకు పాల్పడితే కేసుల్లో ఇరుక్కుని జీవితాంతం బాధపడాల్సి వస్తుందని కాకినాడ డీఎస్పీ హనుమంతరావు ప్రజలకు సూచించారు. పిఠాపురం మండలం విరవాడలో శుక్రవారం ఆయన స్థానికులతో సమావేశం నిర్వహించారు. ఎన్నికల పోలింగ్ సందర్భంగా విరవాడలో తలెత్తిన వివాదం నేపథ్యంలో గ్రామంలో శాంతియుత వాతావరణం నెలకొల్పడానికి ప్రతిఒక్కరూ సహకరించాలని కోరారు. ఎన్నికల కేసుల్లో ఇరుక్కుంటే తప్పించుకునే అవకాశం ఉండదని, ప్రతి ఎన్నికల సమయంలోనూ వారు నిందితులుగా ఉంటారన్నారు. ఎన్నికలను రాజకీయ కోణంలో చూడాలి తప్ప, గ్రామాల్లో ప్రజల మధ్య చిచ్చు పెట్టే పనులు చేయకూడదన్నారు. ఓట్ల లెక్కింపు సమయంలో గ్రామంలో శాంతి యుత వాతావరణం ఉండేలా గ్రామస్తులంతా సహకరించాలన్నారు. ఎవరైనా ఉద్రేకాలకు లోనై ఇతరులను రెచ్చ గొట్టేలా ప్రవర్తిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. గ్రామంలో సెక్షన్ 144, 30 పోలీస్ యాక్ట్ అమలులో ఉన్నందున ప్రజలు గుంపులు గుంపులుగా తిరగరాదన్నారు. అనుమతి లేకుండా సమావేశాలు, ర్యాలీలు నిర్వహించరాదన్నారు. కార్యక్రమంలో సీఐ శ్రీనివాస్, ఎస్సై గుణశేఖర్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న కాకినాడ డీఎస్పీ హనుమంతరావు

డెంగీ వ్యాధిపై అప్రమత్తత అవసరం

కాకినాడ రూరల్: దోమకాటుతో వచ్చే వ్యాధుల్లో డెంగీ తీవ్రమైందని, సకాలంలో వైద్యం చేయించుకోకపోతే ప్రాణాంతకమని డాక్టర్ అద్దాల సత్యనారాయణ అన్నారు. జాతీయ డెంగీ నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో సదస్సు నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ జ్వరం, ఎముకుల నొప్పులు, కళ్ల నుంచి నీరు కారడం, ఆకలి తగ్గి వాంతులు అయ్యేటట్లు ఉండడం, శరీరంపై దద్దుర్లు, ముక్కు నుంచి రక్తం కారడం, రక్త విరోచనాలు, విపరీతంగా తలనొప్పి ఈ వ్యాధి లక్షణాలు అన్నారు. ఈ వ్యాధి వచ్చిన వెంటనే రోగిని ఆస్పత్రికి తరలించాలని, అవసరమైతే రక్త మార్పిడి చేయాల్సి ఉంటుందన్నారు. డెంగీ బారిన పడకుండా ఉండేందుకు పరిసరాల పరిశుభ్రత పాటించాలన్నారు. కార్యక్రమంలో అడబాల రత్నప్రసాద్, రేలంగి బాపిరాజు తదితరులు పాల్గొన్నారు.

అధిక రక్తపోటుతో అనర్థాలు

అధిక రక్తపోటుతో పక్షవాతం, గుండె జబ్బులు వచ్చే అవకాశం ఉందని డాక్టరు వెంకటరమణ, బొండా సూర్యారావు అన్నారు. ప్రపంచ అధిక రక్తపోటు నివారణ దినోత్సవం సందర్భంగా సర్పవరం జంక్షన్‌లో బోట్‌క్లబ్ వాకర్స్ సంఘం ఆధ్వర్యంలో అవగాహన సదస్సు జరిగింది. వారు మాట్లాడుతూ కొవ్వు పదార్థాలు అతిగా తీసుకుంటే రక్తపోటు వస్తుందని అన్నారు. బీపీని నియంత్రణలో ఉంచుకోవాలన్నారు. అడబాల రత్నప్రసాద్, శ్రీనగేష్ తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న డాక్టర్ అద్దాల సత్యనారాయణ

ఘనంగా నర్సుల దినోత్సవం

కాకినాడ క్రైం: స్థానిక డీ కన్వెన్షన్ హాల్‌లో కాకినాడ అపోలో ఆస్పత్రుల ఆధ్వర్యంలో నర్సుల దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. దీనికి ముఖ్యఅతిథిగా అపోలో ఆస్పత్రుల రీజినల్, ఇంటర్నేషనల్ సీఈఓ వై.సుబ్రహ్మణ్యం పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఫ్లోరెన్స్ నైటింగేల్ పుట్టినరోజును నర్సుల దినోత్సవంగా జరుపుకోవడం ఆనవాయితీగా వస్తుందన్నారు. ఆస్పత్రులకు నర్సులు వెన్నెముక లాంటివారని, ప్రతి ఆసుపత్రిలో వారు ముఖ్యపాత్ర పోషిస్తారన్నారు. ఎటువంటి పరిస్థితుల్లోనైనా సేవా దృక్పథంతో రోగికి వైద్య సేవలందిస్తారన్నారు. రోగి ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి డిశ్చార్జి అయ్యే వరకూ వారి బాగోగులు చూసుకుని కోలుకోవడానికి దోహదపడతారని కొనియాడారు. కార్యక్రమంలో యూనిట్ హెడ్ ఐవీ రమణ, అన్ని విభాగాల అధిపతులు, నర్సులు, సిబ్బంది పాల్గొన్నారు.



జ్యోతి ప్రజ్వలన చేస్తున్న అపోలో ఆస్పత్రుల రీజినల్, ఇంటర్నేషనల్ సీఈఓ సుబ్రహ్మణ్యం

సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలి

పెద్దాపురం: విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టి సరికొత్త ఆవిష్కరణలు రూపొందించాలని జేవీవీ సైన్స్ అండ్ టెక్నాలజీ జిల్లా కన్వీనర్ బుద్దా శ్రీనివాస్ అన్నారు. స్థానిక వరహాలయ్య పేట యాసలపు సూర్యారావు భవనంలో పెద్దాపురం చిల్డ్రన్ క్లబ్ (పీసీసీ) ఆధ్వర్యంలో వేసవి శిక్షణ తరగతుల్లో భాగంగా శుక్రవారం సైన్స్ ప్రయోగాలపై ఆయన అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పీసీసీ అధ్యక్షుడు కూనిరెడ్డి అరుణ అధ్యక్షతన జరిగిన శిక్షణలో ఆయన మాట్లాడారు. సైన్స్ ప్రయోగాలపై విద్యార్థులకు అవగాహన కల్పించారు. అనంతరం దుంగల పూజిత సూర్యశ్రీ విద్యార్థులకు కరాటే శిక్షణ ఇవ్వగా, నీలపాల కృష్ణ విద్యార్థులకు కర్రసాము విద్యను నేర్పించారు. సమ్మర్ క్యాంప్ నిర్వాహకులు రొంగల అరుణకుమార్, మంజుల, సాయి, బంగారం పాల్గొన్నారు.

ప్రశాంతంగా బార్ అసోసియేషన్ ఎన్నికలు

- ఉపాధ్యక్షుడిగా భద్రరావు ఎన్నిక



కేవీ భద్రరావు

కాకినాడ లీగల్: కాకినాడ బార్ అసోసియేషన్ 2024–25 ఎన్నికల్లో 14 పదవులకు సింగిల్ నామినేషన్ పడడంతో ఏకగ్రీవమైంది. మరో ఉపాధ్యక్ష పదవికి రెండు నామినేషన్లు దాఖలు కావడంతో పోటీ అనివార్యమైంది. శుక్రవారం ఆ పదవికి జరిగిన ఎన్నికల్లో ఉపాధ్యక్షుడిగా కేవీ భద్రరావు 204 ఓట్ల మెజారిటీతో విజయం సాధించారు. ఉదయం 9 గంటల నుంచి సాయంత్రం ఐదు గంటల వరకు పోలింగ్ జరిగింది. మొత్తం 980 మంది న్యాయవాదులకు 680 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. కేవీ భద్రరావుకు 440 రాగా, సుధిన శ్రీనివాస్‌కు 236 ఓట్లు పడ్డాయి. నాలుగు ఓట్లు చెల్లని ఓట్లుగా నిర్ధారించారు. ఉపాధ్యక్షుడిగా కేవీ భద్రరావు మూడోసారి ఎన్నికయ్యారు.

14 పదవులు ఏకగ్రీవం

2023–24 సంవత్సరానికి బార్ అసోసియేషన్ అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా చక్కా ఎన్‌వీఎస్ శ్రీనివాస్‌తో పాటు ఇతర 12 మంది కార్యవర్గం సేవలందించింది. అలాగే 2024–25 సంవత్సరానికి తిరిగి వీరికే అవకాశం దక్కింది. ప్రస్తుతం జరిగే బార్ అసోసియేషన్ ఎన్నికలకు అధ్యక్షుడిగా ముత్తింటి విశ్వేశ్వరరావు, జనరల్ సెక్రటరీగా చక్కా ఎన్‌వీఎస్ శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీగా పాశం శంకర్ శ్రీనివాస్, కోశాధికారిగా వెంకట్ రెడ్డి బహదూర్ షా, స్పోర్ట్స్ అండ్ కల్చరల్ సెక్రటరీగా డి.అశోక్ కుమార్, లైబ్రరీ సెక్రటరీగా కె.దయానంద్‌రాజు, సూపర్ సీనియర్ కమిటీ మెంబర్‌గా ఏవీసీహెచ్‌ఎస్ఎస్ మూర్తి, సీనియర్ కమిటీ మెంబర్‌గా జీవీ దుర్గాప్రసాద్, లేడీ రిప్రజెంటేటివ్ పదవికి జి.నాగ సునీత, లేడీ కమిటీ మెంబర్‌గా ఎం.సరోజిని, కమిటీ మెంబర్లుగా కె.ఏడుకొండలు, ఎంఏఎస్ఎస్ బాబు, యు.ఉమాగౌరీ, బిందు శ్రీ వేమూరిలు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు.

ఓటర్లలో పోటెత్తిన చైతన్యం

- నియోజకవర్గంలో భారీగా పోలింగ్ నమోదు
- పిఠాపురం మండలంలో అత్యధికంగా 88.62 శాతం

పిఠాపురం: నియోజకవర్గంలోని ఓటర్లలో చైతన్యం వెల్లివిరిసింది. ఇటీవల జరిగిన సార్వత్రిక ఎన్నికల్లో మునుపెన్నడూ లేనివిధంగా పెద్ద ఎత్తున ఓటర్లు పోలింగ్ కేంద్రాలకు వచ్చి ఓట్లేశారు. అత్యధిక శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకుని రాష్ట్రం మొత్తం పిఠాపురం నియోజకవర్గం వైపు చూసేలా చేశారు. పిఠాపురం నియోజకవర్గంలో 2,36,409 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 118183 మంది, స్త్రీలు 118223 మంది, ఇతరులు ముగ్గురు ఉన్నారు. వీరిలో 103370 మంది పురుషులు, 101438 మంది స్త్రీలు, ట్రాన్స్‌జెండర్స్ 3 ఓటర్లు వెరసి మొత్తం 204811 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. 2019లో 80 శాతం పోలింగ్ నమోదు కాగా ప్రస్తుతం 86.63 శాతం పోలింగ్ నమోదైంది. పిఠాపురం మండలంలో అత్యధికంగా 88.62 శాతం పోలింగ్ నమోదు కాగా, పిఠాపురం పట్టణంలో 83.48 శాతం అత్యల్ప పోలింగ్ నమోదైంది.

వివరాలు ఇలా..

పిఠాపురం మండలంలో 62093 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 31468 మంది, స్త్రీలు 30625 మంది ఉన్నారు. వీరిలో 28246 మంది పురుషులు, 26779 మంది స్త్రీలు వెరసి మొత్తం 55025 మంది తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. పిఠాపురం పట్టణంలో 42829 మంది ఓటర్లు ఉండగా వారిలో పురుషులు 20669 మంది, స్త్రీలు 22159 మంది ఒక ట్రాన్స్‌జెండర్ ఉన్నారు. వీరిలో 17434 మంది పురుషులు, 18318 మంది స్త్రీలు, ఒక ట్రాన్స్‌జెండర్ వెరసి మొత్తం 35753 మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. కొత్తపల్లి మండలం 211వ నంబర్ బూత్‌లో అత్యధికంగా 94.88 శాతం మంది ఓటర్లు తమ ఓటుహక్కును వినియోగించుకున్నారు. ఇప్పటికే హాట్ టాపిక్‌గా మారిన పిఠాపురం నియోజకవర్గంలో అత్యధిక శాతం ఓటింగ్ నమోదు కావడంతో మరింతగా వార్తల్లో నిలుస్తోంది. ఎక్కువగా నమోదైన పోలింగ్ ఎవరిని పీఠం ఎక్కిస్తుందన్న దానిపై ఉత్కంఠ నెలకొంది.

పెరిగిన పోలింగ్ శాతం

సామర్లకోట: ఈ ఎన్నికల్లో ఓటర్ల చైతన్యం పెరిగింది. అధిక శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. పెద్దాపురం నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లకు 1,76,987 మంది ఓటు హక్కు వినియోగించుకున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 201 పోలింగ్ కేంద్రాల్లో పోలింగ్ రోజు ఉదయం ఏడు గంటల నుంచి ఓటర్లు బారులు తీరి కనిపించారు. నియోజకవర్గంలో 2,15,095 మంది ఓటర్లు ఉండగా వీరిలో 1,09,294 మంది స్త్రీలు, 1,05,788 మంది పురుషులు, 13 మంది ఇతరులు ఉన్నారు. మొత్తం 82.29 శాతం మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నట్లు పెద్దాపురం ఎన్నికల రిటర్నింగ్ అధికారి జె.సీతారామారావు ప్రకటించారు. ఇందులో 88,895 మంది స్త్రీలు, 88,090 మంది పురుషులు, 8 మంది ఇతరులు ఉన్నారు. సామర్లకోట మండలం పండ్రవాడలోని 187వ పోలింగ్ కేంద్రంలో అత్యధికంగా 93.36 శాతం, పెద్దాపురం మున్సిపాలిటీ పరిధిలోని 81వ పోలింగ్ కేంద్రంలో అత్యల్పంగా 54.38 శాతం మంది ఓటర్లు తమ ఓటు వినియోగించుకున్నారు.

శాఖల పనితీరుపై ఆరా

కాకినాడ: స్థానిక నగరపాలక సంస్థ కార్యాలయంలోని వివిధ విభాగాధిపతులతో ట్రైనీ కలెక్టర్ హెచ్ఎస్ భావన శుక్రవారం సమావేశమయ్యారు. కార్పొరేషన్ కమిషనర్ జె.వెంకటరావు అధ్యక్షతన ఈ సమావేశం జరిగింది. శాఖల వారీగా కార్యకలాపాలను సమీక్షించారు. ట్రైనీ కలెక్టర్ హోదాలో విభాగాల వారీగా శాఖల పనితీరు, విధి విధానాలు, ఇతర అంశాలను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నగరపాలక సంస్థ అదనపు కమిషనర్ సీహెచ్ నాగ నరసింహారావు, డిప్యూటీ కమిషనర్ గుంటూరు శేఖర్, ఎస్ఈ పి.సత్యకుమారి, స్మార్ట్ సిటీ ఎస్ఈ పి.వెంకటరావు, ఈఈ మాధవి, ఎంహెచ్ఓ డాక్టర్ పృథ్వీచరణ్, డీసీపీ హరిదాస్, ఏసీపీ నాగశాస్త్రులు, మేనేజర్ కర్రి సత్యనారాయణ పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ట్రైనీ కలెక్టర్ భావన, కమిషనర్ వెంకటరావు